# వరదేవత

ఊరంతా ఉలికి పడి చూసే అందం ఊర్మిళది. అటువంటి భార్య దొరకడ మనేది తన పూర్వజన్మ సుకృతం అనుకున్నాడు రాఘవ.

అందం, ఐశ్వర్యం, మంచితనం, తెలివితేటలు... అన్నీ ఒక చోట అమరడం అంత తేలిక కాదు. కానీ అవన్నీ తన జీవితంలో అద్భుతంగా అందుబాటు లోకి వచ్చినందుకు గర్వపడు తుంటాడు.

పెళ్ళి చూపులప్పుడే ఊర్మిళ సౌందర్యానికి దాసోహం అన్నాడు. షో కేస్‌లో అందం వేరు.

మనిషి కదలికలో మాటల్లో పొందికలో తొణికిస లాడేదే అసలైన లావణ్యం. ఊర్మిళ... స్త్రీత్వ మంతా మూర్తీభవించిన లావణ్య సీమ.

ఆమె ఉంటే చాలు పరిసరాలన్నీ సరికొత్త శోభతో చైతన్యంతో గుబాళిస్తూ మీఠ [illegible]

కాను" [illegible] క మొదటి రాత్రే ఇంకో విశేషం కనిపెట్టాడు రాఘవ.

శృంగారంలో సుఖం ఇవ్వడ మంటే ఏమిటో, తీసుకోవడ మంటే ఏమిటో ఊర్మిళకు జన్మతో వచ్చిన విద్య.

నవ వధువే అయినా యౌవన మాధుర్యాలను అతనికి అందించడంలో పులకించి మైమరచి పోవడంలో అప్సరస అనిపించింది.

కేవలం అదృష్టం కాదు. జన్మ తరించి పోయే వరం అనుకుంటాడు రాఘవ. ఆ మాటే అంటాడు.

ఆమె ముగ్ధ మనోహరంగా నవ్వుతుంది. సరస్వతీ దేవి వీణ మెట్ల లాంటి చూడ చక్కని పలువరస. కళ్లెత్తితే చాలు కనకాభిషేకాలు.

నవ్వడమే గాని చిరాకు పడడం తెలీ దామెకు. తను వర మనుకుంటున్నాడే గానీ ఆమె మాత్రం శాప వశాన భూలోకంలో గడపడానికి

వచ్చిన గంధర్వ కన్యలా ప్రవర్తిస్తుంది ఎప్పుడూ.

ఆమె నవ్వులూ మాటలూ అలవాట్లూ అభిప్రాయాలూ అన్నీ వింతగా ఉంటాయి. రాఘవతో ఎంత అన్యోన్యంగా ఉన్నా తనకు వేరే బెడ్‌రూమ్ ఏర్పాటు చేసుకుంది. అందులోనే అటాచ్‌డ్ బాత్. ఆమె ప్రొద్దున్నే ఎలా తయా.రవుతుందో అతనెప్పుడూ చూడనే లేదు.

వంటా వార్పు లన్నీ ఎంతో శ్రద్ధగా చూసుకుంటూ భోజ్యేషు మాతా అన్నట్టుగా దగ్గరుండి కొసరి కొసరి తినిపిస్తుంది గాని మామూలుగా అతనితో కలిసి భోం చేయదు.

అలసి సొలసి అతను ఇంటి కొచ్చే సరికి సేద దీర్చే నవమోహిని లాగా ఎదురొస్తుందే గానీ ఆమె ఎప్పుడు తింటుందో, ఎప్పుడు విశ్రాంతి తీసుకుంటుందో అతనికి తెలియనే తెలియదు.

పెళ్ళయి రెండేండ్లు దాటినా ఆమెలో ఎటువంటి విశేషం లేకపోవడంతో ఒకసారి అతను దిగులుగా మాట్లాడేసరికి ఆమె నిండుగా నవ్వేసి "మీరు క్షమిస్తారని సాహసించి నేనే ఒక నిర్ణయం తీసుకున్నాను. ఇప్పట్లో పిల్లలు వద్దని.... డాక్టర్ దగ్గరి కెళ్ళి చిన్న ఏర్పాటు చేసుకున్నాను... తొంద రేమిటి...మన కింకా చాలా వయసుంది కదా!..." అంది.

చెప్పకుండా చేసుకున్నందుకు కలిగిన కోపం చిటికెలో ఎగిరి పోయింది. జీవితానందం అంతలో ఇగిరిపోకుండా ఆమె ఎంతో తెలివిగా బాధ్యతగా తీసుకున్న నిర్ణయానికి ముగ్ధుడయ్యాడు.

భార్యను పిల్లలు కనే యంత్రంగా చూసే పాత కాలపు భర్త కాదు రాఘవ. అందునా... ఊహలకే అతీతమైన సౌందర్యంతో కదిలే ఊర్మిళని అలా ఎలా చూడగలడు?

ఊర్మిళ ఊరుకోదు. ఎవర్నీ ఊరుకో నివ్వదు.

ప్రతిరోజు ప్రతి నిముషం ఏదో కొత్తదనం కోసం తహతహ లాడుతూ, తనెప్పుడూ కొత్త గానే ఉంటుంది. తన చుట్టూ అందరికీ కొత్త దనాన్ని చైతన్యాన్ని పంచడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది.

అందుకే లేడీస్ క్లబ్‌లో ఎక్కువ బాధ్యతలు తీసుకుంది. క్లబ్‌కి సెక్రెటరీ అయింది.

బిజినెస్ మాగ్నెట్ రాఘవకి సొసైటీలో ఇదో కొత్త గుర్తింపు కూడా. ఐశ్వర్యం, అంతస్తు, అధికారం, పలుకుబడి ఒకదానితో ఒకటి పెన వేసుకుని

పెరుగుతాయి. లేడీస్ క్లబ్ పనుల వల్ల ఊర్మిళకు ఇంటి మీద తన మీద ధ్యాస తగ్గిపోతుం దేమోనని రాఘవ భయపడ్డాడు గాని ఫలితం వేరే రకంగా జరిగింది.

ఊర్మిళకు ఇంటిధ్యాస ఏమాత్రం తగ్గలేదు.

ఇంట్లోనే క్లబ్ పనులు ఎక్కువై పోయాయి.

ముఖ్యంగా ఆడవాళ్ళ రాకపోకలతో ఇల్లు మరీ కళపెళగా నిత్యకల్యాణంగా తయారయింది.

ఊర్మిళ సెక్రెటరీ అయ్యాక క్లబ్‌లో పెద్ద వయసు మహిళల కన్న నవ యువతులు, టీనేజర్స్ పాత్ర పెరిగింది. దాంతో క్లబ్ కార్యకలాపాలకి కొత్త గ్లామర్, చురుకుదనం వచ్చాయి. నెల పొడుగునా ఏవేవో సమావేశాలు, చర్చలు, వి.ఐ.పి లకు సన్మానాలు, ఫ్యాషన్ షోలు, ఎగ్జిబిషన్‌లు....

ఊర్మిళకు గుక్క తిరగనంత పని.

ఎంత బిజీ పనులైనా చిరునవ్వులతో సునాయాసంగా భరించడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. క్లబ్బు వల్ల ఇంటికి కొత్త కళ రావడమే కాదు రాఘవకు కొత్త కొత్త ఆకర్షణలు కూడా వచ్చాయి.

ఇంకేం ఆకర్షణ? ఇతర స్త్రీలే...

ఆడవాళ్ళు ఎన్ని రకాలో ఆకర్షణలు అన్ని రకాలు అనుకున్నాడు రాఘవ. క్లబ్ మెంబర్స్‌తో పరిచయాలు పెరిగాక ఒక్కో స్త్రీలో ఒక్కో ఆకర్షణ, ఒక్కో ప్రత్యేకత కనిపించ సాగాయి.

పెళ్ళయి ముగ్గురు పిల్లలున్నా ఇంకా టీనేజ్ గర్ల్‌లా మిసమిస లాడుతూ కనిపిస్తుంది సురేఖ. భర్తకు విడాకు లిచ్చిన మాధవి ప్రేమ మీద సెక్స్‌మీద తన అభిప్రాయాల్ని విచ్చలవిడిగా గుప్పిస్తూ ఉంటుంది. వ్రతాలూ పూజలూ అంటే పడి చస్తుంది.

గీత, మంజుల... అక్క చెల్లెళ్ళు.

ఇద్దరికీ అమెరికా అబ్బాయిలంటే మోజు. ఇంకా అటువంటి వాళ్ళు దొరకడం లేదు.

అర్చనకి భర్త అంటే పడదు. నల్లగా ఉంటాట్ట. మగాళ్ళతో చాలా ఫ్రీగా తిరుగు తుంటుంది.

సన్నగా బంగారు తీగలా ఉండే సుకన్య ఎప్పుడూ ఏదో ఒకటి తింటూ ఉంటుంది.

సెక్సీగా డ్రెస్ చేసుకునే భార్గవి బిగ్గరగా హాలు అదిరిపోయేలా

నవ్వుతుంది.

మాధురి, లలిత, మీనాక్షి...

ఒక్కొక్కరిలో ఒక్కో విశేషం. ఇవన్నీ మనసులో నోట్ చేసుకుంటున్నాడు రాఘవ.

క్లబ్ మెంబర్లు కలుపుగోలుగా మాట్లాడతారు కాబట్టి వాళ్ళున్నంతసేపూ ఇల్లంతా సందడిగా ఉంటుంది. ఊర్మిళకు బోర్ కొట్టే సమస్యే వుండదు.

బిజీబిజీ పనులతో సతమత మవుతూనే రాఘవ వాళ్ళను పలకరించి నప్పుడు ఎంతో సంతోష మనిపిస్తుంది. వాళ్ళలో చాలా మందికి రాఘవ అంటే గౌరవం, అభిమానం, కొంత మందికి క్రేజ్.

అభిమానం కాస్త అప్యాయతగా కూడా మారుతున్నట్టు మెల్లమెల్లగా గ్రహించాడు రాఘవ.

"మీరు భలే జీనియస్ ఆటగా... బిజినెస్‌లో ఎటువంటి సమస్యల్నయినా చిటికెలో పరిష్కరించేస్తా రటగా!..." అంది సురేఖ ఒకసారి.

"ఎవరా చెప్పింది?" అన్నాడు రాఘవ.

"ఇంకెవరు చెప్తారు? ఊర్మిళే!... ఆస్తిపాస్తులకు సంబంధించి నాకో సమస్య వచ్చి పడింది. మీరేదైనా సలహా చెప్పరూ?" అంటూ సమస్య చెప్పింది.

తోచిన పరిష్కారం చెప్పాడు రాఘవ.

ఆమె సంతోషంతో ఉక్కిరిబిక్కి రయింది. గొప్ప ఐడియా చెప్పారంది. తెగ మెచ్చుకుంది...

క్లబ్ పనులు ఎక్కువగా ఉన్నప్పుడు మెంబర్స్ అందరికీ ఇంట్లోనే లంచ్ ఏర్పాటు చేస్తుంది ఊర్మిళ. ఒక్కో మారు డిన్నర్ కూడా.

ఎంత డబ్బు ఖర్చవు తోందో, రాఘవ లెక్క పెట్టడు. ఊర్మిళ సంతోషం కోసం దర్జా కోసం... ఎంత ఖర్చు పెడితేనేం? అదే మంత తప్పు కాదు.

ఆమె సాక్షాత్తూ లక్ష్మీదేవి లాంటిదే.

ఎంత ఖర్చు పెట్టినా తరగదు.

పెట్టిన దానికి పదింతలు తిరిగొస్తుంది.

ఒక రోజు రాత్రి డిన్నర్ బాగా లేటయింది. మెంబర్స్ అందరూ వెళ్ళి పోయారు గాని, మాధవి మాత్రం ఉండి పోయింది. ఆమె ఉంటున్న అపార్ట్‌మెంట్ రాఘవ వాళ్ళింటికి చాలా దూరం. లేటయింది కాబట్టి ఆటోలో వెళ్ళడానికి జంకుతోంది.

"ప్లీజ్... మీరెళ్ళి మాధవిని డ్రాప్ చేసి రాకూడదూ? ఒంటరిగా పంపడం బావుండదు" అని భర్తను పురమాయించింది ఊర్మిళ.

కారులో మాధవితో బాటు వెళ్తుండగా తొలి సారిగా విచిత్రమైన అనుభూతి కలిగింది రాఘవకు.

ఆమె ఏదో కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తూ స్వతంత్రంగా జీవిస్తోంది.

భర్తకు విడాకులు ఇచ్చిన తర్వాత అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగానే ఉంటోంది. ఆమె గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి.

"భార్యభర్తలంటే... ఇష్టం లేకున్నా, జీవితాంతం అఘోరించాలని అదేమైనా కాంట్రాక్టా?" అంటూ బాహాటంగా విమర్శిస్తూ ఉంటుంది మాధవి.

మామూలుగా వస పోసిన పిట్టలా వాగుతూ ఉండే మాధవి ఆ వేళ కారులో వెళ్తూ చాలా ముక్తసరిగా మాట్లాడ్డం వింతగా అనిపించింది.

అపార్ట్‌మెంట్ దగ్గరకు రాగానే "రాకూడదా మా ఫ్లాట్‌కి" అంది నెమ్మదిగా. ఆమె 'మా ఫ్లాట్' అన్నందుకు ఆశ్చర్యపడ్డాడు రాఘవ.

ఆమెను గురించి రసవత్తరమైన కథలు విన్నాడు కాబట్టి సహజంగానే కుతూహల మనిపించింది. వెళ్లాడు. ఫ్లాట్ నీటుగా ఆహ్లాద కరంగా వుంది. కథల్లో లాగా ఆమె అపార్ట్‌మెంట్ అంతా చూపించ లేదు అతనికి. బెడ్ రూమ్‌లోకి తీసుకెళ్ళలేదు.

బాల్కనీలో కూచో బెట్టి కాస్సేపట్లో వేడిగా పాలు తీసుకొచ్చి ఇచ్చింది.

నక్షత్రాల వెల్తురులో ఆమె ముఖంలోకి చూశాడు రాఘవ. కోరికకు కోటి కాంతు లున్నాయి.

ఆమె చిన్న పిల్ల కాదు.

అతనేం కుర్రాడు కాదు.

వారిలో టెన్షన్ లేదు.

"మళ్ళీ ఎప్పుడొస్తారు మీరు?... రారు కదూ? కాస్సేపు ఉండ కూడదా?..." అంటూ దగ్గర కొచ్చింది.

ఉన్నాడు రాఘవ కాస్సేపు.

కాస్సేపట్లోనే కావలసినంత తెలిసింది. మాధవి తప్పేంలేదు. ఆమెకది సహజం. బెడ్‌లో ప్రవర్తన వింతగా ఉంటుంది. ఆశ చాలా ఎక్కువ.

భర్తతో ఎందుకు సరిపడ లేదో అర్థమైనట్లయింది. అయితే ఆ మాట

అనకూడదు. స్వంత విషయాలు స్వంత విషయాలే.

కాస్సేపట్లోనే ఎంతో నీరసమనిపించింది.

ఇంటి కొచ్చాక ఊర్మిళతో మామూలుగా గడపడానికి చాలా ప్రయత్నించాల్సి వచ్చింది.

రాత్రి చీకట్లో అంతరాత్మ చాలా ఇబ్బంది పెట్టింది.

తెల్లవారు ఝామున ఊర్మిళని పొదువుకుని ఆర్తిగా చిన్న కుర్రాడిలా నిద్ర పోయాడు...

ఎందుకో ఏమిటో తెలియని ఆరాటం మొదలైంది రాఘవకు. కలల్లో సీతాకోక చిలుకలు.

విరబూసిన తామరలు. వీణాగానాలు.

ఊర్మిళ వలపు ఉవ్వెత్తున ఎగసి పడే తరంగంలా తనను ముంచేస్తే బాగుణ్ణు. ఆమె కౌగిలిలోనే తను లేకుండా పోతే అదే శాంతి. అదే తృప్తి.

లేకుంటే ఏమిటి ? అంత అద్భుతమైన స్త్రీ ఉండి కూడా మనసు మరొకరి మీదికి ఎందుకు పోతుంది?

"సెక్స్‌లో ఎక్స్" అనే మాటల్లో ఎన్నెన్ని అర్థాలు ఉన్నాయో అనిపించింది.

లేడీస్ క్లబ్‌మెంబర్ అర్చన ఓ సాయంత్రం బస్‌స్టాప్‌లో కనిపించే సరికి ఆమెకు లిఫ్ట్ ఇస్తూ దారిలో హొటల్‌కు తీసుకెళ్ళాడు.

కబుర్లూ కాలక్షేపాలూ అవుతుండగానే అతని కళ్ళలో మెదిలే కోరికని కనిపెట్టి నవ్వింది అర్చన. "తప్పు... ఏమిటలా చూస్తారు? ఊర్మిళ లాం బ్యూటీ వుండగా..." అంటూ వారించింది.

"అంటే తను అనాకారి అయితే... మీ వైపు చూడొచ్చా?" అన్నాడు రాఘవ.

"తను చెప్పినట్లు భలే మొండి మీరు... అయితే ఒక విషయం. చాలా జెంటిల్‌గా ఉంటేనే మాన్‌లీగా కూడా ఉంటారు. అందుకే మీరంటే అభిమానం నాకు. పెళ్ళయిన దాన్ని... ఇలా చెప్పడం కన్నా ఎక్కువ చనువు మీకు ఇవ్వకూడదు... తప్పు కదూ?"

ఆమె మాటల్లో నిజం ఉంది. తప్పు తప్పే.

"ఓ.కే. మనం ఫ్రెండ్స్!" అన్నాడు ఆమె చెయ్యి నొక్కి వదుల్తూ.

ఆ రోజు రాత్రి ఊర్మిళతో గడిపేప్పుడు చాలా గిల్టీగా అనిపించింది. వరాలిచ్చే దేవతకే అన్యాయం చేయడం లేదా తను?

ఆరాటం అంత తేలికగా తీరేది కాదు.

మనసుంటే మార్గా లుండవా?

ఎక్కడైనా ఎలాగైనా కుదురుతుంది.

బంగారు తీగ సుకన్యతో ఓ రోజు మ్యాట్నీకి... అమెరికా మోజున్న అక్కాచెల్లెళ్ళు గీత, మంజులతో ఇంగ్లీషు సినిమాకి అటు తర్వాత రెస్టారెంట్‌కి... మీనాక్షితో గుట్టు చప్పుడు కాకుండా ఓ పూట పిక్నిక్‌కి... ఎలాగో మేనేజ్ చేసేశాడు రాఘువ.

సెక్స్ అని కాదు. అదో సరదా. కాలక్షేపం.

స్నేహం. కబుర్లు. స్పర్శ.

దృష్టికాస్త ఇతర అందాల వైపు మళ్ళే సరికి ఇదివరకటి ప్రపంచమే కొత్త కొత్త ఆకర్షణలతో సాక్షాత్కరించింది. ఆఫీసు లోనే ఉన్నాయి అలరించే అందాలు. అన్ని రోజులూ రాఘువ పట్టించుకో లేదు. ఆ దృష్టితో చూడ లేదు. తీరా చూసే సరికి...

కనురెప్ప పాటులో ఒళ్ళో వచ్చి వాలిన యౌవన శిల్పాలు కాంచన, దీపిక...

ఈ మధ్యే కొత్తగా స్టెనోగా చేరింది రత్నం లాంటి అమ్మాయి యామిని. మూడో రోజుకే మాటలూ చూపులూ ముడేసింది.

కేబిన్‌లో ఏకాంతంలో చిన్న చిన్న సరసాలు చెల్లి పోయాక మధ్యాహ్నం "టైనా వెళ్దామా అన్నాడు రాఘువ. ఈ ఏర్పాట్లలో ఆరితేరి పోయా డతను.

ఊరికి దూరంగా ఓ కాలనీలో ప్రయివేట్ గెస్ట్‌హౌస్ ఉంది. మేనేజర్ కావలసిన వాడే.

గుట్టు చప్పుడు కాదు. కాకుంటే లేటవుతుందనే ఆరాటం మంచిది కాదు కాబట్టి ఇంటికి ఫోన్ చేసి చెప్పాలనుకున్నాడు.

రావడానికి లేటవుతుంది. విజిటర్స్‌కి సెండాఫ్ ఇచ్చి రావాలి. నా కోసం చూడొద్దు అని ఊర్మిళకు చెప్పేస్తే చాలు. తర్వాత ఏ గొడవా ఉండదు.

ఏర్పాటు ప్రకారం యామిని ముందే వెళ్ళిపోయింది. మూడు రోడ్ల కవతల బస్ స్టాపులో వెయిట్ చేస్తూ ఉంటుంది.

తను పికప్ చేసి తీసు కెళ్ళాలి. అంతే.

పావు గంట నుంచి ఇంటికి ఫోన్ ట్రై చేస్తున్నాడు రాఘువ. అందడం లేదు.

గుంయ్యి మంటోంది. ఉన్నట్టుండి డెడ్ అవుతోంది. మళ్ళీ నంబర్లు నొక్కితే నిశ్శబ్దం.

హఠాత్తుగా క్రాస్ టాక్ వినబడింది.

ఎక్కడో దూరంనుంచి వినబడుతున్నట్టు...

అది ఊర్మిళ గొంతే.

"హలో" అన్నాడు గానీ మరుసటి క్షణంలో అర్థమై పోయింది. ఆమెకు తన గొంతు వినబడ్డం లేదు. ఇంకెవర్తోనో మాట్లాడు తోంది.

చాలా సేపట్నుంచి మాట్లాడు తున్నట్టు ఏవో కబుర్లలో... మధ్య మాటలు వినబడ్డాయి.

చెవులు రిక్కించి తమాషాగా విన్న రాఘవ... "రాఘవ" అంటూ తన పేరే వినిపించే సరికి  ఉలిక్కిపడి ఇంకా జాగ్రత్తగా విన్నాడు.

"అదేం టక్కా అలా అంటావూ? ఎక్కడికి పోతాడూ అంటా వేమిటి? ఇలా నీకు మస్కాకొట్టి పూట కొక ఆడదానితో తిరుగుతూ ఉంటే... చివరి కేమవుతుందో తెలుసా?... మొగాళ్ళని నమ్మకూడ దక్కా..." ఎవరో ఆ చెల్లెలు ఆత్మీయంగా హితవు చెప్తోంది.

మువ్వలు మోగించినట్టు నవ్వుతోంది ఊర్మిళ. " నా సంగతి నీకు తెలీదులేవే పిచ్చిమొద్దూ..."

"తెలీకేం అక్కా నువ్వు బూటీ క్వీన్వి... కానీ మీ వారి తిరుగుళ్ళూ..."

తెరలు తెరలుగా నవ్వుతోంది ఊర్మిళ.

ఆ తర్వాత ఒక్కో మాటకి అదిరి పడ్డాడు. అదిరి పడుతూనే ఉన్నాడు రాఘవ.

"పిచ్చిమొద్దూ... మొగాళ్ళని అలా స్వేచ్ఛగా తిరగ నిస్తేనే భార్యమీద గౌరవం ప్రేమా పెరుగుతాయి. బయట తిరిగొచ్చాక... ప్రతిసారీ మావారికి చెప్పలేనంత లవ్ తెలుసా? అందుకే తెలిసి తెలీసీ ఎంకరేజ్ చేస్తున్నాను నేను... అన్నట్టు... ఏకాంతంలో నా దగ్గర ఎన్ని విద్యలున్నాయో మా వారికే ఇంకా తెలీడం లేదులే... పాపం..."

10.04.1998 సంచిక